క్లుప్తంగా

యోగా శిక్షణ ప్రారంభం



పెనమలూరు: చోడవరం గ్రామంలో ఆదివారం యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. గోసాలకు చెందిన శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో చోడవరం శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఉచిత యోగా శిబిరాన్ని శిఖాపల్లి సుబ్బారావు ప్రారంభించారు. యోగా చార్యులు నేరెళ్ల తులసీకృష్ణ మాట్లాడుతూ యోగా చేయటం వలన నిత్య యవ్వనంగా ఉంటారన్నారు. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ ఇస్తామన్నారు. 28 రోజుల పాటు జరిగే శిక్షణలో ఆసక్తిగా ఉన్న వారు యోగా నేర్చుకోవచ్చని సూచించారు.

అధిక రసాయన ఎరువులతో భూమి కలుషితం

పెనమలూరు: అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడటంతో భూమి కలుషితంగా మారుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేవతి అన్నారు. గోసాలలో ఆదివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. భూసారాన్ని పెంచటానికి పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని అన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు. పురుగుల మందులు కూడా తగ్గించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని తెలిపారు. ఉయ్యూరు శాస్త్రవేత్త శైలజారాణి మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారావు, ఉద్యాన అధికారి చందుజోసెఫ్, ఏవో శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు. ఇఫ్కో ఆధ్వర్యంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

వెంట్రప్రగడకు ఎన్టీఆర్ సేవా పురస్కారం



ఉయ్యూరు: సామాజిక సేవకుడు వెంట్రప్రగడ వీరాంజనేయులుకు ఎన్టీఆర్ సేవా పురస్కారం లభించింది. విజయవాడ సిద్ధార్థ అకాడమీలో నందమూరి తారక రామారావు 102వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎక్సరే సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఉయ్యూరులో సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్న వెంట్రప్రగడ వీరాంజనేయులుకు ఎన్టీఆర్ సేవా పురస్కారం అందించి సత్కరించారు. సినీనటుడు రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా వీరాంజనేయులు పురస్కారం అందుకున్నారు.

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సీఐ చిన్న కొండలరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీఐ కొండలరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల్లో రౌడీషీటర్లు పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రశాంత జీవనానికి విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు నగర బహిష్కరణ వేటు వేస్తామని చెప్పారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, గొడవలను ప్రోత్సహించినా వారిపై చర్యలు తప్పవన్నారు. అదే విధంగా గంజాయి వంటి మత్తు పదార్థాల అమ్మకాలపై ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ జక్కంపూడిలోని వైఎస్సార్ కాలనీలో కోరాడ అనురాధ, మురళీకృష్ణ నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె నిత్యశ్రీ (19) నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తుంటుంది. వీరితో పాటు మురళీకృష్ణ తల్లి రాజేశ్వరి కలిసి ఉంటుంది. శనివారం రాత్రి నిత్యశ్రీ నానమ్మతో కలిసి గదిలో నిద్రపోయింది. అర్ధరాత్రి దాటిన తర్వాత రాజేశ్వరి తన కొడుకు, కోడలి వద్దకు వెళ్లి గదిలో నిత్యశ్రీ లేదని చెప్పింది. దీంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ తిప్పలు మళ్లీ మొదలు

- ప్రజలకు మొదలైన రేషన్ తిప్పలు
- రేషన్ షాపుల వద్ద పడిగాపులు
- అసహనం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు



పోరంకిలో రేషన్‌షాపు వద్ద బారులు తీరిన కార్డు దారులు

పెనమలూరు: రేషన్ కోసం బియ్యం కార్డు దారులకు తిప్పలు మళ్లీ మొదలయ్యాయి. ఇంత కాలం వాహనాలలో రేషన్ సరుకులు తీసుకు వచ్చి రేషన్ కార్డు దారులకు ఇళ్ల వద్దే రేషన్ సకాలంలో పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రేషన్ పంపిణీ వాహనాలు (ఎండీయూ) రద్దు చేశారు. రేషన్ కావాల్సిన వారు స్వయంగా రేషన్ షాపులకు వెళ్లి క్యూలో గంటల తరబడి నిలబడి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించింది.

విషయం ఇదీ..

పెనమలూరు మండలంలో దాదాపు 40 వేల రేషన్ కార్డు దారులు ఉన్నారు. వీరి కోసం 56 రేషన్ షాపులు పది గ్రామాల్లో ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే బియ్యం కార్డు దారులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో మండల పరిధిలో 26 ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వచ్చి రేషన్ పంపిణీ చేశారు. మండలంలో ప్రతి నెలా వెయ్యి టన్నుల బియ్యం సకాలంలో పంపిణీ చేసి రికార్డు సృష్టించారు.

మొదలైన సమస్యలు..

కాగా కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను రద్దు చేయటంతో బియ్యం కార్డు దారులకు సమస్యలు మొదలయ్యాయి. కార్డుదారులే స్వయంగా రేషన్ షాపులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్‌షాపులు చాలా దూరంగా ఉండటం, షాపుల వద్ద బారులు తీరి కార్డు దారులు వేచి ఉండటం, సర్వర్ పని చేయక పోవటంతో మొదటి రోజే కార్డు దారులు చాలా ఇబ్బందులు పడ్డారు. రేషన్ తీసుకోవాలంటే ఆదివారం మినహా ఇతర రోజుల్లో కూలీ పనులకు వెళ్లాల్సి ఉండటంతో ఇబ్బందులేనని మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వ విధానంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు..

రేషన్ వాహనాలతో ఇంతకాలం సమస్య రాలేదని, ఇప్పుడు రేషన్‌షాపులకు వెళ్లి రేషన్ తీసుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైన చర్యకాదని కార్డు దారులు పెదవి విరుస్తున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల ఆందోళన..

కాగా 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు రేషన్ ఇస్తారని ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో అమలు జరుగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ డీలర్లు సక్రమంగా తమకు రేషన్ ఇస్తారా లేదా అని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. రేషన్ పంపిణీ విధానం అగమ్యగోచరంగా ఉండటంతో కార్డు దారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది.

రేషన్ వాహనాలు ఉంటేనే మేలు



రేషన్ పంపిణీ వాహనలు ఉంటేనే రేషన్ సక్రమంగా అందేది. ప్రభుత్వం వాహనాలు రద్దు చేయటం సరైన చర్యకాదు. వ్యవసాయ పనులు చేసుకునే తాము రేషన్ తీసుకోవాటంలే కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– ఎండీ ముస్తాక్, గంగూరు

ఒరిగిన విద్యుత్ స్తంభానికి నిచ్చెనే దిక్కు

విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు కొమ్మా రాము వీధిలో విద్యుత్ స్తంభం తీగలపై ఒరిగిపోయింది. విద్యుత్ స్తంభం మొదలు భాగంలో కాంక్రీట్ ధ్వంసమై ఒక పక్కన కరెంట్ తీగలపై ఒరిగింది. నిత్యం వందల మంది రాకపోకలు సాగించే ఈ వీధిలో విద్యుత్ స్తంభం తీగలపై పడటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంతవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు అప్రమత్తమై ఒరిగిపోయిన స్తంభానికి నిచ్చెనను ఊతంగా నిలబెట్టారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఏ ప్రమాదం జరగకముందే ధ్వంసమైన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– రామవరప్పాడు



తీగలపై ఒరిగిన స్తంభానికి ఊతంగా నిలబెట్టిన నిచ్చెన (ఇన్‌సెట్లో) ధ్వంసమైన విద్యుత్ స్తంభం కింది భాగం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొట్టిపాడు, నారా అప్పారావుపేట, ఆనందపురం, బండారు గూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం

బుద్దవరం(గన్నవరం): మండలంలోని బుద్దవరం గ్రామ పరిధిలో ఏలూరు కాలువలో గుర్రపుడెక్క, తూటి కాడ తొలగింపు పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. తొలుత ఈ పనులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఖరీఫ్ సీజన్‌లో చివరి ఆయకట్టు భూములకు సైతం సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఏలూరు కాలువలో సాగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన గుర్రపుడెక్క, తూటు కాడను తొలగిస్తున్నట్లు వివరించారు. ఏలూరు కాలువకు నీరు విడుదల చేసే సమయానికి పనులు పూర్తయ్యే విధంగా నీటి సంఘాలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, డీసీ చైర్మన్ కొసరాజు రాము, వైస్ చైర్మన్ జాస్తి విజయభూషణ్ కుమార్, పాల సొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర, మాజీ ఎంపీటీసీ గొంది శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గన్నవరంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి యార్లగడ్డ రేషన్‌డి పోలో సరుకుల పంపిణీని ప్రారంభించారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు అక్క, తమ్ముడు ఎంపిక

గన్నవరం: తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు గన్నవరానికి చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా కోచ్ పి. గౌరిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి సెలక్షన్స్‌కు 350 మంది క్రీడాకారులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గన్నవరం జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని మానికొండ సాయిసత్య చిన్మయి అండర్-17 విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఆమె సోదరుడైన మానికొండ సాయిప్రశాంత్ అండర్- 14 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. వీరి ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లుగా తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున ఇరువురు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చిన్మయి, ప్రశాంత్‌తో కోచ్

బాబుది వెన్నుపోటు పాలన

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: ఏపీ ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టారని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ చేపట్టనున్న 'వెన్నుపోటు నిరసన' దినం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. అబద్ధపు హామీలతో చంద్రబాబు సీఎం అయ్యాడన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆనాడు ఎన్టీఆర్ నుంచి టీడీపీని లాక్కొని వెన్నుపోటు పొడిచారని, నేడు ఎన్నికల్లో ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి అధికారం చేపట్టి మరో సారి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిగడప పార్టీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు చాంద్‌బాషా, సిద్దిక్, మండూరు కోటేశ్వరరావు, తుమ్మల వరదీష్, నల్లమోతు జీవన్, కిషోర్ పలువురు పాల్గొన్నారు.

బీసీలకు అండగా..

పెనమలూరు: బీసీలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా పెదపులిపాక గ్రామానికి చెందిన మల్లంపల్లి వెంకటేశ్వరరావును నియమించిన సందర్భంగా ఆదివారం కానూరు పార్టీ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. చక్రవర్తి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు మల్లంపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న పాలనలోనే బీసీలకు గుర్తింపు లభించిందన్నారు. నేతలు మాజీ పీఏసీ అధ్యక్షుడు నలజాల సాంబశివరావు, వీర్ల రాంబాబు, షేక్ మస్తాన్, తాత సాయిరామ్, గుండిబోయిన తిరుమలరావు, సురేష్ పాల్గొన్నారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

ఉయ్యూరు: వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉద్ఘాటించారు. ఉయ్యూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం నివాసంలో ఆదివారం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతంపై సమీక్షించి పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జంపాన కొండలరావు మాట్లాడుతూ కూటమి పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత నైజాన్ని మరోసారి బయటపెట్టారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండల అధ్యక్షుడు దాసే రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలు, అమలు చేయని హామీలను నిరసిస్తూ ఈనెల 4న జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కంకిపాడు అయానా ఫంక్షన్ హాలు వద్దకు తరలివచ్చి ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్థతున్నీసాబేగం, కౌన్సిలర్ గోన మదన్, కోఆప్షన్‌సభ్యుడు షేక్ ఖలీల్, అబ్దుల్ సద్దాం, ఎండీ అక్బర్ బాషా, అహ్మద్‌ఖాన్, పినమాల నాగకుమార్, ఉయ్యూరు సుధాకర్, సలీంబేగ్, బెజవాడ నాగబాబు పాల్గొన్నారు.



కానూరు పార్టీ కార్యాలయంలో 'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరిస్తున్న చక్రవర్తి, నాయకులు



మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును అభినందిస్తున్న దేవభక్తుని చక్రవర్తి




ఉయ్యూరులో 'వెన్నుపోటు దినం' పోస్టరు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ప్రకటించిన స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఫలితాల్లో చివరి ఏడాది డిప్లమో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కార్యదర్శి ఎస్.సత్యనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏఎంఎల్ విభాగంలో డి.ఉమాదేవి 97 శాతం మార్కులు ఎస్.భరత్‌కుమార్, పి.కళ్యాణ్ రాజ్ 96 శాతం మార్కులు, ఎల్.అనూష 95 శాతం మార్కులు, కె.నరేంద్ర, 91 శాతం మార్కులు, సివిల్ విభాగంలో జి.జాహ్నవి 92 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. ఐటీ సబ్జెక్ట్‌లో వందకి వంద మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.గోపాలకృష్ణ సిబ్బంది అభినందించారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు మెండు



కంకిపాడు గ్రంథాలయంలో చదువు ఆవశ్యకత వివరిస్తున్న ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు



తెన్నేరు గ్రంథాలయంలో చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ

కంకిపాడు: పుస్తక పఠనంతో మేథోవికాసం కలుగుతుందని వక్తలు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు అవగాహన కల్పించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇచ్చారు. చిత్రకారుడు మల్లేష్‌రావు చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. భగవద్గీత శ్లోకాల పఠనంపై పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

దమ్ము చక్రం.. రహదారులు ధ్వంసం

- దూసుకెళ్తున్న దమ్ము ట్రాక్టర్లు
- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల యజమానులు



ఈడుపుగల్లు- ఉప్పలూరు రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న దమ్ము ట్రాక్టరు

కంకిపాడు: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు దూసుకుపోతున్నాయి. ట్రాక్టరు యజమానులు నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. దీంతో రహదారులు ధ్వంసమైపోతున్నాయి. అధికారులు పట్టించుకోవటం లేదు. రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దమ్ము ట్రాక్టర్ల హడావిడి..

రైతులు ఖరీఫ్ పనులకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే పలు మార్లు కురిసిన వర్షాలకు పొలాలు నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు పొలాలను దమ్ము చేయించి, నారుమడులు పోసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం దమ్ము ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఈ దఫా తొలకరి కూడా ముందుగానే పలకరించనుండటంతో పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనులు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల వరి నారుమడులకు రైతులు సన్నాహాలు మొదలుపెట్టారు.

నిబంధనలు అతిక్రమించి..

నిబంధనల ప్రకారం దమ్ము ట్రాక్టర్లు నేరుగా రోడ్లపై తిరగకూడదు. దమ్ము చక్రాలకు వెడల్‌పెన్ఐనుప బద్దె బిగించి మాత్రమే ట్రాక్టర్లు నడిపించాలి. కానీ నూటికి 90 శాతం మంది నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. దీంతో రహదారులు ధ్వంసమైపోతున్నాయి. పొలాల్లో దమ్ము పనులు పూర్తయిన అనంతరం నేరుగా మట్టి, వ్యర్థాలతో ట్రాక్టర్లు రోడ్ల పైకి చేరటంతో దారి మొత్తం మట్టి గుట్టలు, వ్యర్థాలు రాలి, వర్షానికి కరిగి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

అధికారుల అలసత్వం..

అన్ని రహదారులపైనా దమ్ము ట్రాక్టర్లు రయ్ మంటూ రాకపోకలు సాగిస్తున్నాయి. గ్రామీణ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులపైనా దమ్ము చక్రాల ట్రాక్టర్లు నిబంధనలు మీరి రాకపోకలు సాగించటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మార్జిన్‌లు కోతకు గురై రాళ్లు తేలుతున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభాల్లో దమ్ము ట్రాక్టర్ల సంచారం అధికంగా ఉంటుంది. కనీసం ఆ రోజుల్లో కూడా నిఘా ఏర్పాటు చేసి దమ్ము ట్రాక్టర్ల రాకపోకలను నియంత్రించలేని పరిస్థితుల్లో ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

లక్షలు వెచ్చించి నిర్మించినా..

అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు సైతం ధ్వంసమై ప్రజలకు అసౌకర్యంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిబంధనలు పాటించాలి

దమ్ము ట్రాక్టర్ల యజమానులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. దమ్ము చక్రాలకు ఇనుప బద్దెలు తగిలించాలి. నిబంధనలు పాటించకుండా ట్రాక్టర్లు నడిస్తే శాఖాపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. రహదారులు ధ్వంసం కాకుండా బాధ్యతతో వ్యవహరించాలి.

– చింతా కిరణ్‌కుమార్, ఈఓ, మద్దూరు (ఇన్‌చార్జి ఈడుపుగల్లు)

విద్యార్థులకు బహుమతులు

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మంది విద్యార్థులకు స్పందన సేవా సమితి నిర్వాహకులు ప్రోత్సాహక నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆదివారం పాయకాపురంలో స్పందన సేవా సమితి కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నగదు ప్రోత్సహకాలు, జ్ఞాపికలు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డు ఎంఈఓ ఒంగోలు రాజు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులకు స్పందన సేవా సమితి అందజేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న పేద మహిళకు రూ.5 వేలు, మరో పేద మహిళకు రూ.5 వేల సహాయాన్ని అందజేశారు. స్పందన సేవా సమితి ఫౌండర్ ఇమ్మానేని కృష్ణప్రసాద్, ఎం. సాంబశివరావు, నరసింహమూర్తి, పూలబాల వెంకట్ ప్రసాద్ పాల్గొన్నారు.